సాక్షి చిత్తూరు

శనివారం : 28 : జూన్ : 2025



కూటమి గుణ'పాఠం'

నమ్మి ఓట్లేసినందుకు కూటమి ప్రభుత్వం ప్రజలకు గొప్పగుణపాఠమే చెప్పింది. విలీనం పేరుతో నడ్డివిరుస్తోంది. - 8లో



ఇదేంది సారూ?

పుంగనూరు ఏరియా ఆస్పత్రి ఏఓ తన కారును అక్కడి సిబ్బందితో శుభ్రం చేయించడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



కూటమి రాబందులు

కూటమి నాయకులు చెలరేగిపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్‌పీసీఐ లింక్ పరిశీలించుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తల్లికి వందనం పథకానికి అర్హతలు ఉన్నప్పటికీ నగదు జమకాని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్‌పీసీఐ లింక్ పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకుని విద్యాకార్యదర్శి, అడ్మిన్‌లను సంప్రదించాలన్నారు. మరిన్ని సందేహాలకు 8639598237, 0891-2551001 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ద్రవిడ వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులు



ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

కుప్పం: కుప్పం ద్రావిడ వర్సిటీకి యూజీ, పీజీ కోర్సులతో పాటు ఇంజినీరింగ్ కోర్సులను మంజూరు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో రెండు ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టింది. బీ.టెక్(సీఎస్‌ఈ), బీ.టెక్ సీఎస్‌ఈలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రెండు కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్ట వారు పేర్కొన్నారు.

5న మెగా పీటీఎం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో జూలై 5వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ను నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా 2వ పీటీఎం సమావేశాలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

దోమలతో జాగ్రత్త



అరగొండలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

తవణంపల్లె: దోమలు కుట్టకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. ప్రపంచ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అరగొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అరగొండ కొత్త బస్టాండులో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడేని డ్రైడేగా పాటించాలని సూచించారు. దోమకాటు ఆరోగ్యానికి చేటని చెప్పారు. వైద్యాధికారి కేశవనారాయణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు శివసుబ్రమణ్యం, రామకృష్ణ, పీహెచ్‌ఎన్ ఎం.జీవకళ, ఎంపీహెచ్‌ఈఓ భానుప్రకాష్, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, గోపి, నారాయణ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శరత్‌కుమార్, సతీష్‌కుమార్, భార్గవి, రోజా, ఎంఎల్‌హెచ్‌పీ హైమావతి, జాహ్నవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మోసాల మేనిఫెస్టోపై నిలదీద్దాం

- చంద్రబాబు మోసాలను ఎండగడదాం
- ఏడాది కాలంగా ప్రజలను వంచిస్తున్న ప్రభుత్వం
- వందల హామీలను గుప్పించి తుంగలో తొక్కేశారు
- ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన దేవుడు జగనన్న
- కూటమి పాలనపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమన్వయకర్తలు



డిజిటల్ స్క్రీన్‌లో చంద్రబాబు మేనిఫెస్టోను, జగనన్న సందేశాన్ని వీక్షిస్తున్న పార్టీ నేతలు

తిరుపతి మంగళం : అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పిన కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుదామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్‌ను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణ స్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, కృపాలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టోను స్క్రీన్ ద్వారా పార్టీ నేతలకు వివరించారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలను వివరిస్తూ జిల్లా, నియోజకవర్గ, మండల, పంచాయతీ, గ్రామ స్థాయి వరకు చంద్రబాబు మేనిఫెస్టోను తీసుకెళ్లి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడదామని పిలుపునిచ్చారు.



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో స్కానర్‌ను సెల్‌ఫోన్ల ద్వారా స్కాన్ చేసుకుంటున్న పార్టీ నేతలు

మోసగించడం చంద్రబాబు నైజం



ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో గత ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలకంటే ఎక్కువే ఇస్తానంటూ నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి నమ్మిన వాళ్లను మోసగించడం చంద్రబాబు నైజం . ఎన్నికల్లో ఇచ్చిన ‘సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా? బాబూ. అధికారలోకి రాగానే ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు 1500 ఇస్తానన్నావ్, 50 ఏళ్లకే పెన్షన్ అన్నావ్, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అన్నావ్, మహిళలకు ఉచిత బస్సు అన్నావ్, లక్షల ఉద్యోగాలు అన్నావ్, రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నావ్ ఇలా చెప్పుకుంటూ పోతే వందల అబద్ధపు హామీలు గుప్పి ప్రజలను మోసగించావు. వీటితో పాటు తల్లికి వందనం పేరుతో కొంతమంది తల్లుల ఖాతాల్లో డబ్బులు వేసి లక్షల మంది తల్లులను వంచించావు. ఇలా చెప్పిన అబద్ధాన్నే పదిసార్లు చెప్పి ప్రజలను మోసగించడం తమ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి తెలియదన్నారు. ఇప్పటికే చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలంతా గ్రహిస్తున్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి నాయకులను నిలదీసేలా చేద్దాం.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్

ఏడాది కాలంగా వంచనే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయకుండా ప్రజలను వంచిస్తూనే ఉన్నారు. అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మేనిఫెస్టో బాండ్లపై సంతకాలు చేసి మరీ ప్రజలకు ఇచ్చారు. అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయక పోగా అనేక ఆంక్షలు విధించి లక్షల మంది లబ్ధిదారులను తొలగించారు. తల్లికి వందనం పేరుతో లక్షల మంది తల్లులకు ఎగనామం పెట్టారు. ఉద్యోగాలు లేవు, నిరుద్యోగ భృతి లేదు. ఆడబిడ్డ నిధి లేదు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించడం తప్ప ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపానపోలేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షపూరిత రాజకీయాలకు చంద్రబాబు, పవన్‌కళ్యాన్, లోకేష్ పాల్పడుతున్నారు. అయినా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వెంట వస్తున్న జన సంద్రాన్ని చూసి కూటమి నాయకుల గుండెల్లో దడ పుడుతోంది. అందుకే జగనన్నను ఎక్కడికక్కడ నిలువరించాలని చూస్తున్నారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి మోసాలను ఎండగడుదాం. అందుకు ప్రతి నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నేతలు కంకణబద్ధులు కావాలి.

– భూమన కరుణాకరరెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

జగనన్న పాలనలోనే సంక్షేమం



అధికారం కోసం ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం. మాట కోసం కట్టుబడి ఇచ్చిన హామీల కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు జగనన్న. ఐదేళ్ల జగనన్న పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎక్కడా సంక్షేమ పథకాలను ఆపలేదు. ప్రతి పేదవాడికి సంక్షేమాన్ని అందించి పేదల గుండెల్లో జగనన్న దేవుడయ్యారు. అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళుతాం.

– కళత్తూరు నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

కూటమి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తాం



గత ఎన్నికల్లో కూటమి నాయకుల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మోసాలను ఎండగడుదాం. ప్రజలను వంచించి మోసగించిన ప్రజాద్రోహులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోవడంతో యువత భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. లోకేష్‌కు మంత్రి పదవి, నాగబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వడంలో ఉన్న ఆసక్తి యువతకు ఉద్యోగాలు , నిరుద్యోగ భృతి ఇవ్వడంలో శ్రద్ధ చూపడం లేదు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షపూరిత రాజకీయాలు చేయడం తప్ప ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతాం.

మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ



సమావేశంలో పాల్గొన్న జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నాయకులు

విద్యార్థులతో చాకిరీ



బైరుగానిపల్లి పాఠశాలలో చెత్తను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

సాక్షి టాస్క్‌ఫోర్సు: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బైరుగానిపల్లి ప్రాథమిక పాఠశాల చుట్టూ చెత్తాచెదారాన్ని విద్యార్థులచేత శుభ్రం చేయించడం పట్ల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. బైరుగానిపల్లి పాథమిక పాఠశాలలో 30 విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ అంటూ విద్యార్థుల చేత చెత్తాచెదారం శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. చదువుల కోసం ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే ఉపాధ్యాయులు చాకిరీ చేయిస్తున్నారని తల్లితండ్రులు ఆవేదక వ్యక్తం చేస్తున్నారు.

చదువు నేర్పించాల్సిన చోట కూలి పనులా?



ఆర్కేరోజా

నగరి : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన చోట పిల్లలచేత కూలిపనులు చేయించడం.. అదీ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గం బైరుగానిపల్లి పాఠశాలలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై మాజీ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులచేత చెత్త ఎత్తించడమేంటని ప్రశ్నించారు. తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామని రూ.13వేలే ఇస్తూ ఒక్కో విద్యార్థికి రూ.2వేలు పాఠశాల నిర్వహణకు కేటాయిస్తున్నాం అని చెబుతున్నపుడు విద్యార్థులతో శుభ్రత పనులు ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించారు. చదువు నేర్పించాల్సిన చోట కూలి పనులా?.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఇప్పటికైనా విద్యాశాఖ పై దృష్టి పెట్టాలన్నారు.

సచివాలయ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్



మాట్లాడుతున్న చిత్తూరు కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శులకు శుక్రవారం చిత్తూరులో బదిలీ కౌన్సెలింగ్ ప్రారంభించారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో కమిషనర్ నరసింహప్రసాద్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లతో పాటు పుంగనూరు, పలమనేరు, మదనపల్లె, కుప్పం, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి మునిసిపాలిటీల్లో ఐదేళ్ల పాటు ఒకేచోట పనిచేస్తున్న అడ్మిన్, అమినిటీ, ప్లానింగ్ కార్యదర్శులు 474 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక్కో కార్యదర్శి నుంచి మూడు ప్రాంతాలను సూచించాలని వివరాలను తీసుకున్నారు. నియామక సమయంలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా, సీనియారిటీ జాబితా రూపొందించి బదిలీలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. శనివారం వెల్ఫేర్, ఎడ్యుకేషన్, శానిటరీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ రెడ్డి, చిత్తూరు సహాయ కమిషనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలోని మునిసిపాలిటీల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరైన కార్యదర్శులు

మామిడి గోల..తీరేదెలా?

జిల్లాలో మామిడి సమస్య ఉధృతమవుతోంది. గుడిపాలలో గోలగోలవుతోంది. ఎట్టేరి వద్ద రోడ్డు పాలవుతోంది. మిగిలిన మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పలు ఫ్యాక్టరీలలో కేజీ రూ.4 పడిపోయింది. రైతుల రద్దీని తగ్గించేందుకు అధికారులు కుయుక్తులు పన్నుతున్నారు. తోతాపురి రేటు పెరుగుతుందని ఆశచూపిస్తున్నారు.

జిల్లాలో జఠిలమవుతున్న మామిడి సమస్యలు

- జీడీనెల్లూరు ఎట్టేరి వద్ద రోడ్డు పాలవుతున్న మామిడి
- మిగిలిన మండలాల్లోనూ ఇదే పరిస్థితి
- రద్దీని తగ్గించేందుకు అధికారుల కుయుక్తులు



గుడిపాల మండలం రాష్ట్ర సరిహద్దు ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా క్యూకట్టిన మామిడి ట్రాక్టర్లు

కాణిపాకం/గుడిపాల: కూటమి ప్రభుత్వం మామిడి రైతులను మాయ చేస్తోంది. ఇన్నాళ్లు మద్దతు ధర పేరుతో నమ్మించింది. ఇప్పుడు మళ్లీ ధర పెరుగుతుందని బోల్తా కొట్టిస్తోంది. ఇప్పటి వరకు 1.7 లక్ష టన్నుల కాయలు ఫ్యాక్టరీలకు చేరినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఇంకా తోటల్లో 2 లక్షల టన్నుల దాకా కాయలున్నట్టు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో 40 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. వారం రోజులు మరో 20 నుంచి 30 శాతం కాయలు కోతకు రానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఫ్యాక్టరీలు వాటి పళ్ల గుజ్జు తయారీ సామర్థ్యాన్ని కోల్పోనున్నాయి. ఇప్పటికే గుజ్జు తయారీ 60 నుంచి 80 శాతం పూర్తయినట్టు ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతున్నారు. తొలుత అల్ఫోన్సో గుజ్జు తయారీ 80 వేల నుంచి లక్ష టన్నుల వరకు గుజ్జు తయారైనట్లు తెలుస్తోంది. బయట రాష్ట్రాల నుంచి, ఇతర జిల్లాల నుంచి వచ్చిన తోతాపురి కాయలు 1.2 లక్ష టన్నుల వరకు ఉంటాయని.. ఈ రకంగా 60వేల టన్నుల గుజ్జు తయారైనట్టు తెలుస్తోంది. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఫ్యాక్టరీలకు రూ.1.8 లక్ష టన్నుల కాయలు చేరాయి. తద్వారా 90 వేల టన్నుల గుజ్జు ఉత్పత్తయినట్టు అధికారులు చెబుతున్నారు. అక్రమంగా ఫ్యాక్టరీలకు తరలించిన కాయలు లక్ష టన్నుల దాకా ఉండగా..తద్వారా 60వేల టన్నుల గుజ్జు ఉత్పత్తి అయినట్టు రైతులు అంచనా వేస్తున్నారు. అధికారులు మాత్రం 4 లక్షల నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నుల గుజ్జు తయారీ చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే విదేశాల్లో యుద్ధాల ప్రభావం మళ్లీ పళ్ల గుజ్జు ఫ్యాక్టరీలను దెబ్బతీయనున్నాయి.

తప్పని అవస్థలు

జీడీనెల్లూరు మండలం ఎట్టేరి ప్రాంతంలోని జైన్ ఫ్యాక్టరీ వద్ద క్యూ తగ్గనంటోంది. ఫ్యాక్టరీ నిర్వాహకులు శుక్రవారం కాయలు కొనేదిలేదని బోర్డు పెట్టారు. కాయలు అన్‌లోడింగ్ అయ్యేంత వరకు రైతులు రోడ్డుపై తిప్పలు పడుతున్నారు. దీని కారణంగా శనివారం టోకన్లు, వరుస సంఖ్య నంబర్లు ఇచ్చి కాయలు కొనుగోలు చేస్తారా.. లేదా అనే విషయంపై స్పష్టత లేదని అధికారులు చెబుతున్నారు.

ఫ్యాక్టరీలో తోతాపురి రూ.4 నిజమేనా?

కూటమి ప్రభుత్వం తోతాపురికి మద్దతు ధర ప్రకటించింది. ఫ్యాక్టరీలన్నీ కూడా కేజీ రూ.8కే కొనాలని ఆదేశాలిచ్చింది. అయితే కొన్ని రోజుల తర్వాత కేజీ తోతాపురి రూ.6, తర్వాత రూ.5 అంటూ పాట పాడాయి. ఇప్పుడు పలు ఫ్యాక్టరీలు రూ.4కే కొనుగోలు చేస్తున్నట్టు పలువురు అధికారులు, రైతులు చెబుతున్నారు. అయితే ఫ్యాక్టరీలు ఎక్కడా ఈ రూ.4 విషయాని బయట పెట్టడం లేదు.

బారులు తీరిన ట్రాక్టర్లు

గుడిపాల మండలం, గొల్లమడుగు ప్రాంతం.. తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో ఉంది. ఈ ప్రాంతంలోని ఫుడ్ ఇన్ఫోసిస్ ఫ్యాక్టరీకి ట్రాక్టర్లు సుమారు 700 నుంచి 800 వరకు చేరుకుంటున్నాయి. వారం రోజులుగా ట్రాక్టర్ల క్యూ ఫ్యాక్టరీ గేటు నుంచి రాష్ట్ర సరిహద్దు దాటింది. తమిళనాడు రాష్ట్రంలోని కాట్పాడి కింగ్‌స్టన్ కాలేజీ వరకు క్యూకట్టాయి. దీంతో ఆ రాష్ట్ర అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇక తమిళనాడుకు చేరిన క్యూను అటువైపుగా వెళ్లే పలు శాఖ అధికారులు, సామాజిక మాధ్యమ ప్రియులు వీడియోలు తీసి పోస్టులు పెడుతున్నారు. ఇదీ రాష్ట్రవ్యాప్తంగా వైరల్‌గా మారడంతో శుక్రవారం జిల్లా అధికారులు, పోలీసులు క్యూను కుదించే పనిలో పడ్డారు. ఇదివరకు రోడ్డుకు ఓ వైపు ఉన్న ట్రాక్టర్లను.. ఇప్పుడు రెండు వైపులా పెట్టించారు. అలాగే రోడ్డును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాల్లో కూడా ట్రాక్టర్లను బంధించారు. దీంతో గీతగీసినట్లు రాష్ట్ర సరిహద్దు వరకే బండ్లు కనిపిస్తున్నాయి. దీని తర్వాత వచ్చే బండ్లను అడవి కింద ఖాళీగా కనిపిస్తున్న స్థలాల్లో పార్కింగ్ చేయిస్తున్నారు. ఈ రద్దీ జూలై 5 వరకు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

మాగోడు వినేదెవరు?



మామిడి రైతులు కష్టాలు చెప్పుకుంటే.. వినే ఓపిక ఉండాలి. మా కష్టాలు ఎందుకు చెప్పేది లేండి. దారుణంగా ఉంది పరిస్థితి. ఈ విధంగా ఎప్పుడూ లేదు. మూడు రోజులుగా రోడ్డుపైనే పడి ఉన్నాం . ఇంకా కాయలు అన్‌లోడ్ కాలేదు. ఫ్యాక్టరీలు తోతాపురి కేజీకి ఎంత ఇస్తున్నారో చెప్పడం లేదు.

– మధుసూదన్‌నాయుడు, మంగళపల్లి, బంగారుపాళ్యం మండలం

క్లుప్తంగా

మోడల్ స్కూల్స్ జిల్లా కన్వీనర్‌గా అనిత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మోడల్ స్కూల్స్ జిల్లా కన్వీనర్‌గా డా.టీఎస్ అనితను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో జిల్లా కన్వీనర్ చేపట్టాల్సిన విధి విధానాలు పేర్కొన్నారు. జిల్లాలోని బైరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న టీఎస్ అనితకు జిల్లా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.

వరసిద్ధిని సేవలో రాష్ట్ర చీఫ్ కమిషనర్



స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం రాష్ట్ర చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామి దర్శన సేవలు చేయించారు. తర్వాత పండితులు ఆశీర్వచనాలు చేశారు. ఈవో పెంచల కిషోర్ స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

సర్వే వంద శాతం పూర్తి చేయాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సర్వేను వంద శాతం పూర్తి చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె ఏఎస్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వేలు సకాలంలో పూర్తి చేయని ఏఎస్ఎంలకు పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై అలా చేస్తే కుదరదని, ఎప్పటికప్పుడు సర్వేలను పూర్తి చేస్తూ..రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని ఆమె ఆదేశించారు.

రైల్వే సిబ్బందిపై అసహనం



రైల్వే పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న సీఐ యతీంద్ర

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రూరల్ మండలం, సిద్ధంపల్లె సమీపంలో గురువారం జరిగిన రైల్వే దొంగతనం పై రైల్వే రేణిగుంట సీఐ యతీంద్ర సిబ్బంది పై మండిపడ్డారు. దోపిడీ ఘటనకు సంబంధించి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాల పై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైలులో డ్యూటీ చేసే పోలీసుల పనితీరు పై అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల వద్ద ఆయుధాలున్నా తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు.

కూటమి గుణ'పాఠం'!

సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో 2025–26 విద్యాసంవత్సరంలో 40 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి, ఆరవ తరగతిలో ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త అడ్మిషన్లు నమోదు కాలేదు. ఈ నలభై పాఠశాలల్లో 2, 3, 4, 5 తరగతుల్లో మాత్రమే 681 మంది విద్యార్థులు చదువుతున్నారు. కుప్పం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అంతకంటే రెట్టింపు మంది విద్యార్థులుండడం గమనార్హం. అంటే 40 ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే విద్యార్థులు ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో సమానంగా ఉండంటే ప్రభుత్వ విద్య ఏ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



సీఎం సొంత నియోజకవర్గంలో జీరో అడ్మిషన్లు నమోదైన గుడుపల్లి మండలం మాలవాని కొత్తూరు ప్రాథమిక పాఠశాల

ప్రభుత్వ బడుల నిర్వీర్యం

- ఒకటి, ఆరవ తరగతుల్లో నమోదుకాని కొత్త అడ్మిషన్లు
- విద్యాసంవత్సరం ప్రారంభమైనా కానరాని చేరికలు
- లోపం ఎక్కడుందో తెలియని పరిస్థితుల్లో విద్యాశాఖ
- 357 పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం సర్కారు పాఠశాలలను నిర్వీర్యం చేస్తోంది. పేద, బడుగు, బలహీన వర్గాలకు చదువును దూరం చేసేలా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే పాఠశాలలు ఇబ్బడిముబ్బడిగా విలీనం చేస్తోంది. సుదూర ప్రాంతాలకెళ్లి చదువుకోలేక పేద విద్యార్థులు బడికి స్వస్తి చెబుతున్నారు. కొందరు ప్రయివేటు పాఠశాలలకు వెళ్తుండగా మరికొందరు ఇంటిపట్టునే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభమై నెలరోజులకు పైగా అవుతున్నా ఇంతవరకు ఒకటి.. ఆరో తరగతిలో కొత్త అడ్మిషన్లు లేక చాలా పాఠశాలలు వెలవెలబోతుండడం గమనార్హం.

బడుల విలీనంతో విద్యార్థులు దూరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కాగానే ప్రభుత్వ బడులపై తమ ప్రతాపం చూపించింది. ప్రభుత్వ బడులను మెరుగుపరచాల్సింది పోయి మోడల్ ప్రైమరీ పాఠశాలల పేరుతో విలీన ప్రక్రియ చేపట్టింది. కి.మీ దూరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను విలీనం చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియ వల్ల ప్రతి రోజూ జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలో వెనక్కి తగ్గడం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వందలాది పాఠశాలల్లో ఒకటి, ఆరవ తరగతిలో అడ్మిషన్లు నిలిచిపోయాయి.

భవిష్యత్‌లో నిర్వీర్యం

జిల్లాలోని ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో ప్రభుత్వ బడుల్లో నాడు–నేడు, విద్యాకానుక, బైజూస్, అమ్మఒడి, ఉచితంగా ట్యాబ్‌లు, సీబీఎస్‌ఈ సిలబస్ ఇలా ఎన్నో విప్లవాత్మకమైన పథకాలను అమలు చేసింది. ఆ పథకాలకు ప్రతి ఏటా వేలాది కోట్లు ఖర్చు చేశారు. ఎలాంటి స్వలాభం లేకుండా పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ సర్కారు కృషిచేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు రెడ్‌కార్పెట్ వేస్తూ ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేస్తోంది.

జిల్లా సమాచారం

పాఠశాల స్థాయి	పాఠశాలల సంఖ్య
ప్రాథమిక	1,925
ప్రాథమికోన్నత	181
ఉన్నత	329
మొత్తం	2,435

నియోజకవర్గాల వారీగా జీరో అడ్మిషన్లు

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య
చిత్తూరు	47
గంగాధరనెల్లూరు	88
కుప్పం	40
నగరి	13
పలమనేరు	42
పుంగనూరు	58
పూతలపట్టు	69
మొత్తం	357

ఈ పాఠశాలల్లో అడ్మిషన్లు నిల్

- చిత్తూరు నియోజకవర్గంలోని చిత్తూరు నగరంలో ఉన్న వినాయకపురం ఉర్దూ యూపీ పాఠశాల, మిట్టూరులో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల తమిళం, కాజూరు ప్రాథమిక, జోగుల కాలనీ ప్రాథమిక, ఎస్‌టీ కాలనీ, గుడిపాల మండలంలో ఎంపీపీఎస్ 190 రామాపురం, ఏఎల్‌పురం, సీఎం కండ్రిగ, డీబీ పల్లి, గొల్లమడుగు తమిళం, తెలుగు, కేటీ పల్లి ఇలా మరిన్ని పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కాలేదు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని గంగాధర నెల్లూరు మండలంలో ఎంపీఎస్ ఆత్మకూరు, ఆవలకొండ, గరిగలపల్లి, కార్వేటినగరం మండలంలో ఎంపీపీఎస్ సీకాయపట్టెడ, ఈడిగపల్లి, పాలసముద్రం మండలంలో ఆముదాల, జీఎం పురం, పెనుమూరు మండలంలో ఎల్‌కే పీవీ ఊరు, గోపాలపురం, కొట్టార్లపల్లిలో అడ్మిషన్లు లేవు.
- పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలంలో ఉన్న ఎంపీపీఎస్ చిన్నాపురం, కూతలవంక, రమణపల్లి, గంగవరం మండలంలో ఎంపీపీఎస్ జీఎల్ఎస్ ఫార్మ్, కేసీ పెంట, పలమనేర మండలంలో దొడ్డిపల్లి ఎస్టీ, గజ్జలవారి ఊరు పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయి.
- పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యం మండలంలోని బండ్లదొడ్డి ట్రైబల్ వెల్ఫేర్, ఎంపీపీఎస్ బైరిపల్లి, ఐరాల మండలంలోని అగ్రహారపల్లి హరిజనవాడ, బొమ్మసముద్రం, ఎర్రేపల్లి, మట్టపల్లి, మిట్టూర్, పేయనగారిపల్లి, పూతలపట్టు మండలంలోని ఈడిగపల్లి, కొత్తపల్లి, నోచుపల్లి, ఎస్ఆర్ పల్లి పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయి.

బడులు నిర్వీర్యం



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సర్కారు బడుల పట్ల చిన్నచూపు చూస్తోంది. కార్పొరేట్, ప్రైవేట్ బడులకు ప్రాధాన్యమిస్తోంది. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదవుతున్నా ఎవరు బాధ్యత వహిస్తారో తెలియడం లేదు.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి.

ఇదేంది సారూ?

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఏఓ ఫణిభూషణ్ నిర్వాకం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం విధులకు కారులో హాజరైన ఆయన ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లే ముందు అక్కడే విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కారును నీటితో శుభ్రం చేయించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై ఏఓను వివరణ కోరగా తాను కారు కడుగుతుంటే వారే వచ్చి తనకు సహాయం చేశారని చెప్పారు. ఇది లావుండగా కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది చేత ఇలాంటి పనులు చేయించడం ఏమిటని వివిధ సంఘాల నేతలు అధికారుల తీరుపై మండి పడుతున్నారు.

బంగారు ఇచ్చేశావా తల్లీ?

చిత్తూరు అర్బన్: ఓ మహిళ రూ.2 లక్షలకు పైగా విలువ చేసే బంగారు ఆభరణాలను రూ.500కే ఇచ్చేసింది. తీరా తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఐరాల మండలం చింతగుప్పలపల్లెకు చెందిన గౌరి, చిత్తూరులోని ఓ దుకాణంలో నెలకు రూ.7 వేల వేతనంతో పనిచేస్తోంది. ఈనెల 24వ తేదీన ఆమె చర్చీవీధిలో నడుచుకుంటూ వస్తుంటే ఓ హిందీ వ్యక్తి వచ్చి మాట కలిపాడు. భాష అర్థం కాకపోవడంతో మరో వ్యక్తి వచ్చి, హిందీని తెలుగులో అనువదిస్తూ సాయం చేసినట్లు నటించాడు. తన వద్ద రూ.10 లక్షల నగదు ఉందని.. ఈ మొత్తాన్ని ఊరికి తీసుకెళ్లలేనని, దీనికి బదులుగా తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలు ఇవ్వమని మాయ చేశాడు. ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న రూ.500 నోట్ల కట్టలను గౌరీకి చూపించడంతో.. ఆమె తన శరీరంపై ఉన్న 22 గ్రాముల బరువున్న బంగారు ఆభరణాలను తీసి ఇచ్చేసి, డబ్బుల సంచి ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను తీసుకుంది. తీరా ఇంటికి వెళ్లి చూస్తే నోట్ల కట్టల్లో మొత్తం తెల్ల కాగితాలు, ఇరువైపులా డమ్మీ రూ.500 నోట్లు ఉండడాన్ని గుర్తించి షాక్‌కు గురైంది. విషయం కుటుంబ సభ్యులకు చెబితే సమస్య వస్తుందని మిన్నకుండిపోయింది. తీరా విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి కాయలు కోయొద్దు



ముచ్చుకాలువ దగ్గర అటవీశాఖ సిబ్బంది అడ్డుకోవడంతో నిరసన తెలుపుతున్న మామిడి రైతులు

– అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

తవణంపల్లె: తమ అనుభవంలో ఉన్న పొలాల్లో ఉన్న మామిడి తోటల్లోని కాయలను కోయనీయకుండా అటవీశాఖ అధికారులు శుక్రవారం అడ్డుకున్నట్లు రైతులు ఆరోపించారు. మామిడి కాయలు కోసి ట్రాక్టర్‌కు లోడ్డు చేసిన కాయలను ఫ్యాక్టరీకి తరలించకుండా అడ్డుకోవడంతో రైతులు ఆవేదనకు లోనయ్యారు. తవణంపల్లె మండలం, సోమల మండలంలోని రైతులకు పెద్దపంజాణి మండలం పెద్దకాపల్లె రెవెన్యూ దాఖలాలో సర్వే నం.211/2ఎ సుమారు 20 మంది రైతులకు రెవెన్యూ అధికారులు డీకేటీ పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. 1976 నుంచి భూములను చదును చేసి ఉపాధి హమీ పథకం కింద మామిడి చెట్లు నాటి పోషించుకుంటున్నట్లు పేర్కొన్నారు. 1990లో రెవెన్యూ అధికారులు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ మంజూరు చేయడంతో కరెంటు సర్వీసులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా మామిడి కాయలను కోసి అమ్ముకుంటూ వచ్చామని తెలిపారు. అటవీశాఖ అధికారులు ఫారెస్టు భూములంటూ అడ్డు చెప్పడంతో హైకోర్టులో స్టే తెచ్చుకున్నట్లు వివరించారు. స్టేను ధిక్కరించి కాయలను కోసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. శనివారం ఉదయం కలెక్టర్, డీఎఫ్‌ఓను కలసి తమ సమస్యను విన్నవిస్తామని వారు పేర్కొన్నారు.

వరిగపల్లి చెరువుపై..కూటమి రాబందులు!

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

- నిబంధనలకు పాతరేస్తున్న అక్రమార్కులు
- రూ.లక్షల్లో అక్రమార్జన
- చోద్యంచూస్తున్న రెవెన్యూ, జలవనరుల శాఖ

యాదమరి: మండల పరిధిలోని వరిగపల్లి చెరువుపై కూటమి రాబందులు వాలిపోయాయి. రాత్రిపగలు తేడాలేకుండా మట్టి తవ్వేసి తరలిస్తున్నాయి. రోజుకు దాదాపు 100 నుంచి 150 ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నాయి. వచ్చిన ఆదాయాన్ని అధికారులు, సంబంధిత అధినాయకులకు వాటాలు పంచుతూ యథేచ్ఛగా చెలరేగిపోతున్నాయి. ఈ దందాను నియంత్రించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.





మట్టిని తవ్వుతున్న జేసీబీ, పట్టపగలే రోడ్డుపై తరలుతున్న మట్టి

నిబంధనలకు పాతర

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువులో మట్టిని తరలించే ముందు రెవెన్యూ, జలవనరుల శాఖల అనుమతి పొందాల్సి ఉంది. అది కూడా 2 నుంచి 3 అడుగుల లోతు వరకే ఎత్తాలి. కానీ కూటమి ప్రభుత్వంలో ఆ నిబంధనలేవీ అమలు కావడం లేదు. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా భారీ యంత్రాలు పెట్టి తవ్వేస్తున్నారు. దీంతో వరిగపల్లి చెరువు మొత్తం గుంతలమయంగా మారింది. ఇక్కడి నుంచి ఇటుకల బట్టీలకు, రియల్ ఎస్టేట్ లే అవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



గుంతలమయమైన చెరువు

కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువుల్లోని మట్టిని తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఇప్పటి వరకు ఈ దందా మా దృష్టికి రాలేదు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచుతాము. నిజమని తేలితే దోషులను శిక్షించి, యంత్రాలను సీజ్ చేస్తాము.

– పార్థసారథి, తహసీల్దార్, యాదమరి


మోటార్ సైక్లిస్ట్ మృతి



మృతి చెందిన జయచంద్ర

బంగారుపాళెం: మండలంలోని తంబుగానిపల్లె క్రాస్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం.. మండలంలోని తంబుగానిపల్లెకు చెందిన మనోహర్ కుమారుడు జయచంద్ర కేజీ సత్రం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. బంగారుపాళెం నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో జయచంద్ర(18) తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జయచంద్ర మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

కుప్పం: చెన్నై నుంచి బెంగళూరు వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

అదుపుతప్పిన ద్విచక్రవాహనం

– ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన తమిళియన్

శ్రీరంగరాజపురం : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. యాదమూరి కీనటంపల్లి పంచాయతీ, షికారు కాలనీకి చెందిన రమేష్ కుమారుడు తమిళియన్ పళ్లిపట్టు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి, మండల కేంద్రం వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తమిళియన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆమె శుక్రవారం ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాల కారణంగా మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు వ్యాపించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, వైద్యులు అనిల్‌కుమార్, సుదర్శన్, అనూష, గిరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ బస్సుల కేటాయింపు వరం : ఈడీ

– త్వరలో జిల్లాకు 50 విద్యుత్ బస్సులు



విద్యుత్ బస్సుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న హైదరాబాద్ బృందం

తిరుపతి అర్బన్ : తిరుపతికి విద్యుత్ బస్సుల కేటాయింపు ఓ వరంగా భావించాల్సి ఉందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈడీ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని డీపీటీవో కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా హైదరాబాద్ నుంచి వచ్చిన విజ్ఞానజ్యోతి ఆటోమొబైల్ ఇంజినీరింగ్ వారు విద్యుత్ బస్సుల శిక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ.. 2021లో జిల్లాలో 100 విద్యుత్ బస్సులను కేటాయించిన అంశాన్ని గుర్తుచేశారు. విద్యుత్ బస్సులు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉన్నాయని. కాలుష్య నియంత్రణకు దోహదపడుతాయని పేర్కొన్నారు. అలాగే జిల్లాకు త్వరలో మరో 50 విద్యుత్ బస్సులు రానున్నాయని చెప్పారు. ఈ కొత్త సర్వీసులను మంగళం డిపో కేంద్రంగా నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీటీవో జగదీష్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు సిద్ధంకండి

రానున్న తిరుమల బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ ఈడీ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన డీపీటీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు సందర్భంగా తిరుమలకు నడుపుతున్న సర్వీసులను ముందుస్తు ప్రణాళిక ప్రకారం తనిఖీలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీటీవో జగదీష్, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ బాలాజీ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, అసిస్టెంట్ ఇంజినీర్ మహేంద్ర పాల్గొన్నారు.

భార్యను కొట్టి చంపేశాడు



మృతి చెందిన ప్రమీల (ఫైల్)

పాలసముద్రం: భార్యాభర్తల గొడవ చినికిచినికి గాలీవానగా మారింది. ఆగ్రహించిన భర్త భార్యను కొట్టి చంపేశాడు. ఈ ఘటన శుక్రవారం తిరుమళరాజుపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. పులిచర్ల మండలం, కల్లూరు గ్రామనికి చెందిన కే.ప్రమీల, అతని భర్త కార్తీక్ ఏడాది కాలంగా తిరుమళరాజుపురంలో వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం భార్యాభర్తలు గొడవపడ్డారు. ఆగ్రహించిన భర్త కార్తీక్ ఇంట్లో ఉన్న పెద్ద కొయ్య తీసుకుని భార్య ప్రమీల ముఖం, తలపై చితకబాదాడు. వెంటనే ఆమెను సోలింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 64,879 మంది స్వామి వారిని దర్శించుకోగా 23,960 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.09 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.